క్లుప్తంగా

దుర్గమాంబకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం జరిపారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఐఎస్ఎఫ్ యూనిట్‌లో దేహదారుఢ్య పరీక్షలు



రన్నింగ్ చేస్తున్న అభ్యర్థులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌లో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్‌కు చెందిన ఎన్ఐఏ, సీఐఎస్ఎఫ్, ఎస్ఐఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్‌కు చెందిన జనరల్ డ్యూటీ కానిస్టేబుళ్ల నియామకాల్లో భాగంగా అర్హులైన అభ్యర్థులకు శుక్రవారం వివిధ పరీక్షలు నిర్వహించారు. రోజుకు 100 మందికి ఫిజికల్ టెస్టులు, వైద్య పరీక్షలు ఈ యూనిట్‌లో నిర్వహిస్తున్నారు. నవంబర్ 9వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. హాజరైన అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో చేస్తున్నారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ సీనియర్, కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఏపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

మర్రిపాలెం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సమాఖ్య (ఏపీటీఎఫ్) ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చేనెల 6,7,8 తేదీల్లో విజయనగరంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హృదయరాజు కోరారు. 50వ వార్డు బిర్లా జంక్షన్ సమీపంలో ఓ హోటల్‌లో శుక్రవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 ఏళ్లు అయిన సందర్భంగా ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు విజయనగరంలో పూల్‌బాగ్‌లో ఉన్న జె-కన్వెన్షన్ మార్పు బాలకృష్ణమ్మ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ మహా సభల్లో విద్యావేత్తలు,మేధావులు పాల్గొంటారన్నారు. విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారత, పెన్షన్లు, నూతన విద్యా విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు చెప్పారు. ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.ఎస్.నాయుడు మాట్లాడుతూ విశాఖ జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయరావు, జాకబ్ సేవియర్, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు, నాయకులు జోజిబాబు, పట్నాయక్, కృష్ణారావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.జానకీరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వెతలు?



రామ్మూర్తిపంతులు పేటలో గోతులు, మురుగుతో నిండిన గణబాబు మార్గ్



104 ఏరియా అండర్ పాత్‌వే వద్ద నిలిచిన వర్షపు నీరు

- అధ్వానంగా 'గణబాబు' మార్గ్
- గోతుల రహదారిలో ప్రయాణం నరకప్రాయం
- అండర్ పాత్‌వేలో రాత్రిళ్లు దొంగతనాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధి కంచరపాలెం, 104 ఏరియా, మర్రిపాలెం ప్రాంతాల్లో కేంద్రం నిధులతో నిర్మించిన రైల్వే అండర్ పాత్‌వే మార్గాలు అధ్వానంగా తయారయ్యాయి. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో 104 ఏరియా డిఫెన్స్ మార్గం వంతెన, కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట రైల్వే అండర్ పాత్ వే వంతెన (గణబాబు మార్గ్) నాలుగేళ్లకే భయంకరంగా మారాయి. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోవడంతో వంతెన దిగువ నుంచి రాకపోకలు సాగించే వారు దుర్వాసన భరించలేకపోతున్నారు. మరోవైపు విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకటి పడితే అంధకారం రాజ్యమేలుతోంది. దీనికితోడు అక్కడ మందుబాబులు, దొంగలు చేరడంతో పాదచారులు, వాహనదారులు అటుగా వెళ్లాలంటే భయపడిపోతున్నారు.

రాళ్లు తేలి.. మురుగు నిలిచిపోయి...

కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, పైడిమాంబకాలనీ, ముత్యమాంబకాలనీ, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, టిడ్కో కాలనీలు, ఎఫ్‌సీఐ, రైల్వే వాషింగ్‌లైన్, డీజిల్ లోకో షెడ్, 104 ఏరియా, ఆశవానిపాలెం, అశోక్ పార్క్, శ్యామ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగుల రాకపోకలకు ఈ అండర్ పాత్‌వేలే ప్రధాన మార్గాలు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన రైల్వే వంతెన మార్గాలకు స్థానిక ప్రజాప్రతినిధులు తమ పేర్లు పెట్టుకునేందుకు ఉత్సాహం చూపించారు కానీ వాటి నిర్వహణపై మాత్రం శ్రద్ధ చూపలేదని పలువురు విమర్శిస్తున్నారు. వంతెన దిగువన గల సీసీ రహదారుల్లో రాళ్లు తేలి గోతులు ఏర్పాడ్డాయి. వర్షపు నీటి ప్రవాహంలో వచ్చే చెత్త, వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు పేరుకుపోతోంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేస్తే పాదచారులపై బురద తుళ్లుతోంది. దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన మార్గంలో గణబాబు మార్గమని సూచించే బోర్డుకు రంగులు వేయడానికి ఉన్న శ్రద్ధ... రాళ్లు తేలిన రహదారికి మరమ్మతులు చేయించడంపై లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



చీకటిలో అండర్ పాత్‌వేలో ప్రయాణిస్తున్న వాహన చోదకుడు

విద్యుత్ లైట్లు లేక చోరీలు

రామ్మూర్తిపంతులుపేట రైల్వే గేటు నుంచి 325 మీటర్ల దూరం గల వంతెన రహదారిలో జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు గతంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణను మరిచిపోవడంతో ఆ లైట్లు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. చీకటిలో ద్విచక్ర వాహనాల వెలుగులోనే పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే అదునుగా అండర్ పాత్‌వేలో ప్రయాణించే పాదచారుల పట్ల మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. వంతెన రహదారిలో ప్రతీ ఆదివారం సంత జరుగుతుంటుంది. ఇలాంటి సమయంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దారికాచి ఆ మార్గంలో ప్రయాణించే వారి నుంచి ఫోన్లు, డబ్బులు, వస్తువులు దోచుకుంటున్నారు. ఇవ్వకపోతే బ్లేడ్లుతో కోసేసిన సంఘటనలు గతంలో జరిగాయి.

పాదచారులకూ నరకయాతనే..

జీవీఎంసీ 56, 57 వార్డుల ప్రజలు, ఉద్యోగుల సౌకర్యార్థం, రైల్వే గేటు సమస్య నుంచి విముక్తి కోసం పాదచారుల వంతెన నిర్మించారు. అండర్ ఫుట్‌పాత్ మార్గం ఏర్పాటు చేసినా రహదారి అధ్వానంగా ఉండడంతో అటుగా ప్రయాణించే ఆయా కాలనీల పాదచారులు నరకయాతన పడుతున్నారు. అండర్ పాత్‌వే రహదారిలో నాచు పట్టి, రాళ్లు తేలి ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నడిచేందుకు సక్రమంగా లేకపోవడంతో రైల్వే ట్రాక్ మార్గాన్నే వినియోగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు శానిటరీ సిబ్బంది రహదారిని శుభ్రం చేసే దాఖలాలు కనిపించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి అండర్‌పాత్ వే వంతెన రోడ్డుకు మోక్షం కల్పించాలని, రహదారిని నిత్యం శుభ్రం చేసేలా చూడాలని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

వంతెన రహదారిలో ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటుంది. మురుగు నిత్యం నిలిచిపోవడంతో ముక్కు మూసుకుని వెళ్తున్నాం. లైట్లు వెలగక పోవడంతో చీకటిలో రాకపోకలు సాగిస్తున్నాం. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.


– మళ్ల లక్ష్మీప్రసన్న, రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

సమస్యలపై అధికారులు, స్థానిక వార్డు కార్పొరేటర్ పట్టించుకోవడం లేదు. వంతెనకు స్థానిక ఎమ్మెల్యే 'గణబాబు' మార్గ్ పేరు పెట్టడంలో ఉన్న ఉత్సాహం సమస్యలు పరిష్కరించడంలో చూపడం లేదు. స్థానిక కార్పొరేటర్ ముందుకు రావడం లేదు. జోనల్ అధికారులు ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తే ప్రశాంతంగా రాకపోకలు సాగిస్తాం.

– ఎ.మధుబాబు, గవర కంచరపాలెం

మళ్ల విజయప్రసాద్‌కు అభినందనలు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మళ్ల విజయప్రసాద్‌ను నియమించడంతో నియోజకవర్గంలోని ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. మళ్ల విజయప్రసాద్ గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మళ్ల రెండో సారి పశ్చిమ సమన్వయకర్తగా నియామకం కావడంతో పశ్చిమ పరిధిలోని పలు వార్డుల కార్పొరేటర్లు, ఆయా వార్డుల పార్టీ అధ్యక్షులు ఆయనను అభినందించారు.

నగరానికి ఈశాన్య ట్రైనీ పోలీసులు

విశాఖ సిటీ: నార్త్ ఈస్ట్ పోలీస్ అకాడమీ (నెపా) నుంచి 5 మంది ట్రైనీ డీఎస్పీలు, 10 మంది ట్రైనీ ఎస్ఐలు అధ్యయన పర్యటన(భారత్ దర్శన్) నిమిత్తం విశాఖకు వచ్చారు. ఈ నెల 29వ తేదీ వరకు పోలీస్ విభాగానికి చెందిన పోలీస్ కంట్రోల్ రూమ్, 3వ పట్టణ పోలీస్ స్టేషన్, ఫింగర్ ప్రింట్ బ్యూరోతో పాటు నగరంలో పలు అధ్యయన కేంద్రాలు, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించనున్నారు. శుక్రవారం వీరిని బీచ్ రోడ్డులో ఉన్న పోలీస్ ఆఫీసర్ మెస్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. వీరితో సమావేశం నిర్వహించి పలు అనుభవాలను పంచుకున్నారు. మెళకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.

దుర్గాదేవి ఉత్సవాలకు పందిరి రాట



మల్కాపురం యాదవ వీధిలో పందిరి రాట కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలో స్థానిక డేరింగ్ అండ్ డాషింగ్ యూత్ ఆధ్వర్యంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం యాదవ వీధిలో పందిరి రాట పూజా కార్యక్రమం చేపట్టారు. నిర్వాహకులు, విజ్ఞాన మండలి యాదవ సంఘం ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, యాదవ మహిళలు పూజలు జరిపారు. నవరాత్రి వేడుకల్లో రోజుకో అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు. దీపారాధన, అన్నసమారాధన, భారీ ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.



క్రాంతినగర్‌లో పందిరి రాట వేస్తున్న మహిళలు

63వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక మహిళలు అమ్మవారికి పూజ చేసి పందిరి రాట వేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

లారీ ఢీకొని డాక్‌యార్డు ఉద్యోగి మృతి

- విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. ప్రమాదం
- మృతుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం వాసి



సంఘటనా స్థలంలో దిలీప్‌కుమార్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. తమ కళ్లెదుటే ఉద్యోగి దుర్మరణం చెందడంతో తోటి ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం అరడకోటకు చెందిన ఎం.దిలీప్ కుమార్ (26) నేవల్ డాక్‌యార్డ్‌లోని టీఎంఎం విభాగంలో పనిచేస్తున్నాడు. షీలానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలు దేరాడు. డాక్‌యార్డు నుంచి షీలానగర్ టోల్ గేటు వైపు వస్తుండగా వెనుకనే వస్తున్న లారీ అతడి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దిలీప్ కుమార్ అదుపుతప్పి పడిపోవడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు ప్రమాదం వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని గాజువాక స్టేషన్‌కు తరలించారు. దిలీప్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతనికి ఇటీవలే వివాహమైనట్టు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఎస్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలి



విజయనగర్ గేటు వద్ద నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల నిరసన

సింధియా: సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనకు ప్రత్యామ్నాయంగా ఉన్న ఎస్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు విజయనగర్ గేటు వద్ద నిరసన తెలిపారు. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్న దిలీప్‌కుమార్ శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా షీలానగర్ వద్ద ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విచారం వ్యక్తం చేశారు. అనంతరం దిలీప్‌కుమార్ మృతికి వ్యతిరేకంగా విజయనగర్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఎస్‌బీసీ బ్రిడ్జిపై నుంచి రక్షణరంగ ఉద్యోగుల రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా ఎస్‌బీసీ బ్రిడ్జిపై నుంచి ఉద్యోగుల రాకపోకలకు అనుమతించాలని పదే పదే కోరుతున్న యాజమాన్యం నిరాకరిస్తోందన్నారు. రక్షణ శాఖ మంత్రికి, నేవీ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో డాక్‌యార్డ్, షీలానగర్ రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలని కోరినా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఈ రోడ్డులో ఎవరో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు శేఖర్, కాశీం, భానోజీ, పరమేష్, నాగార్జున, రాజేష్, గణేష్, నాయుడు పాల్గొన్నారు.

కనీస పింఛన్ కోసం ఈపీఎస్ పెన్షనర్ల ధర్నా



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

అగనంపూడి: తమకు కనీస పెన్షన్ రూ.7500 నిర్ణయించాలని ఈపీఎస్ 95 పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితకాలనీలో ధర్నా నిర్వహించారు. జాతీయ పోరాట కమిటీ ప్రతినిధి ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు మాట్లాడుతూ 2013 నుంచి ఈపీఎస్ 95 పెన్షనర్లకు ఈపీఎస్ రూ.7500 చెల్లించాలని, అలాగే డీఎలు కూడా ఇవ్వాలని, పెన్షనర్ దంపతులిద్దరికీ ఆరోగ్య కార్డులు అందివ్వాలని ఆయన కోరారు. దేశ వ్యాప్తంగా 78 లక్షల మంది పెన్షనర్లు పోరాటాలు చేస్తున్నారనాన్నరు. కేంద్ర మంత్రులు శీతాకాల సమావేశాల్లో పెన్షనర్లకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఐఎస్‌టీయూసీ నాయకుడు ఉరుకూటి బాబూరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు నాలుగువేల లోపల పెన్షన్ ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు. సామాజిక పెన్షన్ రూ.4వేలు ను ప్రభుత్వం చెల్లిస్తుందని, అలాంటిది దీర్ఘ కాలం పాటు సేవలు అందించిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత కనీస పెన్షన్ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఉరుకూటి అచ్చినాయుడు, అప్పలరాజు, విందుల వరహాలు, సీతంనాయుడు, రెడ్డి, కొత్తరాజు, గోవిందరావు, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల నౌకా సందర్శన

మహారాణిపేట: భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిషింగ్ హార్బర్ జెట్టీ 5,6లో మత్స్య షికారీ, మత్స్య దర్శిని కార్యక్రమం జరిగింది. విద్యార్థుల సందర్శన కోసం మినీ ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో నౌకలో ఉన్న పరికరాలు,నావిగేషన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, లైఫ్ సేవింగ్, అగ్నిమాపక ఉపకరణాలు (ఫైర్ ఫైటింగ్ అప్లియన్సెస్), మత్స్య సంపద అభివృద్ధికి దోహపడే అంశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను బెహరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేరీటైం ట్రెనింగ్ విద్యార్థులు, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరంగ్ ట్రెనింగ్ (సీఐఎఫ్ఎన్ఈటీ) విద్యార్థులు, ప్రజలు వీక్షించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారికి పౌష్టికాహారం తినిపిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: గర్భిణులు ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకుంటే తల్లితో పాటు కడుపులో బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 58వ వార్డు పిలకవానిపాలెం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో జాతీయ పౌష్టికాహార మహోత్సవాలను శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతా లు నిర్వహించారు. అనంతరం పలువురు చిన్నారులకు పౌష్టికాహారం తినిపించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను, తెలుగు యువత నాయకులు రామ్మోహన్‌నాయుడు, పోతాబత్తుల శ్రీను, టీడీపీ 61వ వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మియాదవ్, పూడి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన

- రోడ్లు జలమయం
- ఇబ్బంది పడిన ప్రయాణికులు



చిన్నారిని స్కూల్‌కు గొడుగు ఆధారంతో తీసుకువెళ్తున్న తల్లి



వర్షానికి హెచ్‌పీసీఎల్ గేటు ఎదురుగా సర్వీస్ రోడ్డుపై నిలిచిన బురద నీరు



మల్కాపురం సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మల్కాపురం: అల్పపీడనం కారణంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పారిశ్రామిక ప్రాంతం ముద్దయింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ప్రధానంగా మల్కాపురం, ఆర్‌కేపురం,శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లోని సర్వీసు రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. కాలువలు పొంగి మురుగుతో పాటు వ్యర్థాలు రోడ్లపై నిలిచాయి. గురు,శుక్ర వారాల్లో వర్షం జోరు తగ్గకుండా కురవడంతో పారిశ్రామిక వాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షం కారణంగా విద్యార్థులు,ఉద్యోగులు తడుసుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి కలిగింది.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి





మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ప్రిజం కాలేజీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని చెప్పారు. విద్యతోనే ఉన్నతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. కచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. యువత అత్యంత వేగంగా బైక్‌లు నడుపుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 20 ఏళ్లలోపు వారే మరణిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంత మంది నేరగాళ్లు కొరియర్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట ప్రజలను దోచుకుంటున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిజం డిగ్రీ, పీజీ కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యా రాజగోపాల్, డాక్టర్ అనురుధ్ కోవిల్లి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.